ప్రజాశక్తి

శనివారం 21 డిసెంబర్ 2024 5

శ్రీ సత్యసాయి



ఇళ్ల స్థలాలకు హక్కులు కల్పించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని పాలసముద్రం సమీపాన సర్వేనెంబర్ 125 నందు తాత్కాలికంగా ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్న పేదల ఇంటి స్థలాలకు చట్టబద్ధ నివాస హక్కులు కల్పించాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండ వెంకటేష్ ఆధ్వర్యంలో అక్కడ నివాసం ఉన్న పేదలు శుక్రవారం పాలసముద్రం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో ఇండ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు ఆంజనేయులు, భాస్కర్, లక్ష్మీదేవి, అచ్చమ్మ, వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు

"హిందూపురం తూమకుంట పారిశ్రామిక వాడలోని శ్యాం ఫెరస్ అలైస్ స్టీల్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ ప్రమాదశాత్తు క్రేన్ మీద నుంచి కిందకు పడి, తీవ్ర గాయాలు అయ్యి కోమాలోకి వెళ్లాడు.

"తూముకుంట పారిశ్రామిక వాడలోని మహర్షి స్టీల్స్‌లో కర్నాటక రాష్ట్రం గౌరిబిదనూరుకు చెందిన ఓ కార్మికుడు వెల్డింగ్ పని చేస్తూ షార్ట్ సర్క్యూట్‌తో సంఘటన స్థలంలోనే మరణించాడు".

"గత జూన్ నెలలో తూమకుంట పారిశ్రామిక వాడలోని రోల్ వెల్ పరిశ్రమలో విధి నిర్వహణలో ఉన్న కోటిపికి చెందిన కార్మికుడు లక్ష్మినారాయణ ఉన్నఫలంగా పరిశ్రమలోనే మరణించాడు. ఈ విషయం బయటకు రానివ్వకుండా పరిశ్రమ యాజమాన్యం లోగుట్టు వ్యవహారం నడిపింది".

"రెండు రోజుల క్రితం అనంతపురం జిల్లా యాడికి మండలం బోయరెడ్డిపల్లి గ్రామంలోని ఆదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో శివకేశవ అనే కార్మికుడు మరణించాడు. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు".

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలు.. వాటిలో మరణిస్తున్నా, గాయపడిన ఘటనలకు సంబంధించిన కొన్ని ఉదాహరణలు ఇవి. ఇలా ఒక్క మహమ్మద్ ఇర్ఫాన్, లక్ష్మినారాయణ, శివకేశవ కాదు ఎంతో మంది స్థానిక, వలస కార్మికుల ప్రాణాలు పరిశ్రమల్లో గాల్లో కలుస్తున్నాయి. పని ప్రదేశంలో సరైన రక్షణ లేకపోవడంతో కార్మికుల ప్రాణాలు గాల్లో దీపంలా మారుతున్నాయి. విషవాయువుల లీకేజీ, రియాక్టర్లు, బాయిలర్లలో పేలుళ్లు, ఎగిసిపడుతున్న అగ్నికీలలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వరుస పారిశ్రామిక ప్రమాదాలు కార్మికుల జీవితాల్లో చీకట్లు నింపుతున్నాయి. పనిచేస్తే తప్పా కుటుంబం గడవని నేపథ్యంలో కార్మికులు గత్యంతరం లేక ప్రాణాలు అరచేతపట్టుకుని నిత్యం ప్రాణభయంతో పనులు చేయాల్సి వస్తోంది. కార్మికులకు రక్షణగా ఉండాల్సిన సంబంధిత అన్ని శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ కాలం గడిపేస్తున్నారు.

ప్రమాదం..అనునిత్యం..!



ప్రజాశక్తి-హిందూపురం

ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు ఉపాధి నిమిత్తం హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురంతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమల్లో పనిచేసేందుకు వస్తున్నారు. ముఖ్యంగా హిందూపురం ప్రాంతంలో రసాయన పరిశ్రమలు, ప్లాస్టిక్, ఇంజినీరింగ్, ఐరన్, గ్రానైట్ తదితర పరిశ్రమలు ఉండడంతో వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. పరిశ్రమల్లో భద్రతా చర్యలను తీసుకోవడంలో యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం కూడా పరిపాటే అయింది. పొట్టకూటి కోసం వచ్చిన వారు ప్రమాదాలకు బలైపోతున్నారు. పరిశ్రమల్లో తరచూ తనిఖీలు చేసి కార్మికుల భద్రత కోసం చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు ఎక్కడా కనిపించడం లేదు. దాంతో కార్మికుల కోసం కనీసం భద్రతా ప్రమాణాలను పరిశ్రమలు పాటించడం లేదు. యంత్రాల వద్ద పనిచేసే కార్మికులకు కూడా రక్షణ పరికరాలను సైతం సమకూర్చడం లేదు. మరోపక్క అనుభవం ఉన్న కార్మికులను విధుల్లో పెట్టుకుంటే ఎక్కువ వేతనాలు ఇవ్వాల్సి వస్తుందనే దురుద్దేశంతో ఏమాత్రం అనుభవం లేని కార్మికులను పనిలో పెట్టుకోవడంతో ప్రమాదాలు జరిగి మతి చెందుతున్నారు. కార్మికులకు రక్షణ పరికరాలను ఇవ్వకపోవడం, యంత్రాల పనితీరుపై అవగాహన లేకపోవడంతో.. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోతున్నారు. ఎంతోమంది శరీర అవయవాలు కోల్పోయి అవిటివారిగా కూడా మారుతున్నారు. ప్రమాద విషయాలను చాలావరకు సంబంధిత పరిశ్రమల యాజమాన్యాలు ఏమాత్రం బయటకు పొక్కనీయడం లేదు. బాధితులకు ఎంతోకొంత ముట్టజెప్పి చేతులు దులెపేసుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.


శ్యాం ఫెరస్ అలైస్ స్టీలు పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ గాయపడి కోమాలోకి వెళ్లిన మహమ్మద్ ఇర్ఫాన్


ప్రమాదంలో గాయపడిన సోమనాథ్ (ఫైల్ ఫొటో)

- ◆ పరిశ్రమల్లో కార్మికులకు భద్రత కరువు
- ◆ పర్యవేక్షణ మరచిన అధికార యంత్రాంగం
- ◆ రక్షణను విస్మరిస్తున్న యాజమాన్యాలు
- ◆ ఘటన జరిగితే ఓ రెండు రోజులు హడావుడితో సరి

కర్నాటకలో చికిత్సలు

హిందూపురం సమీపంలోని పారిశ్రామిక వాడల్లో ప్రమదాలు జరిగినప్పుడు స్థానికంగా ఉన్న ప్రభుత్వ అసుపత్రికి తీసుకొస్తే ప్రమాద సంఘటన బయటకు వస్తోందని భావించి కర్నాటక రాష్ట్రం గౌరిబిదనూరులోని ఓ ప్రవేటు అసుపత్రికి తీసుకెళ్లి వైద్య చికిత్సలను అందిస్తున్నారు. ప్రమాదంలో మరీ ఎక్కువగా కార్మికులు గాయపడితే వారికి తూతూమంత్రంగా చికిత్సలను చేయించి, చేతులు దులుపుకుంటున్నారు. ప్రతి నెలా ఆ అసుపత్రికి హిందూపురం స్టీల్ తదితర పరిశ్రమల వారు వేలాది రూపాయాలు చెల్లిస్తున్నారంటే ఎంత కార్మికులకు అక్కడ చికిత్సలు చేయిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

హడావుడితో అధికారులు సరి..!

పరిశ్రమల్లో ప్రమాద విషయం బయటకు వచ్చి పత్రికల్లో వార్తలు వస్తేగానీ అధికారుల్లో చలనం రావడం లేదు. తనిఖీలు, పరిశీలన పేరుతో అధికారులు రావడం.. యజమానులు ఇచ్చే విందును ఆరగించడం... ఇచ్చిన మాముళ్లు పుచ్చుకుని వెళ్లి పోవడం... పరిపాటిగా మారిందనే ఆరోపణలున్నాయి. హిందూపురం తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలే కాదు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పరిశ్రమల్లోనే ఈ తంతు సర్వ సాధరణమనే విమర్శలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేమి నిర్వాహకులకు వరంగా మారింది. ఎప్పుడైనా ప్రమాదాలు జరిగితే నామమాత్రం పరిహారం ఇచ్చి చేతులు దులుపేసు కుంటున్నారనే విమర్శలూ వినిపిస్తున్నాయి. ఇక కార్మికుల భద్రత కోసం ఉన్న చట్టాలు పరిశ్రమల్లో మచ్చుకైనా అమలుకునోచు కోవడం లేదు.


ఉక్కు పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించిన ప్రదేశం (ఫైల్ ఫొటో)

యాజమాన్యాల నిర్లక్ష్యం

పరిశ్రమల లాభాపేక్ష, ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్లే పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వలస కార్మికులు చనిపోతే అత్యంత గోప్యంగా వారి మృతదేహాలను యాజమాన్యాలు తరలిస్తున్నాయి. అధికారులు కనీస పర్యవేక్షణ లేకపోవడం అత్యంత విచారకరం.

ఈఎస్.వెంకటేష్ సిఐటియు జిల్లా కార్యదర్శి.

ధనార్జనే పరిశ్రమల వైఖరి

తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలోని వివిధ పరిశ్రమల్లో భద్రత ప్రణామాలు పాటించడం లేదు. ధనార్జనే ధ్యేయంగా పరిశ్రమ యాజమాన్యాలు పనిచేస్తున్నాయి. ప్రమాదాలు జరగకుండా భద్రతా అధికారులు ఎప్పటికప్పుడు పరిశ్రమలను పర్యవేక్షించి చర్యలు చేపట్టాలి.

రవికుమార్, తూమకుంట కార్మిక సంఘం అధ్యక్షులు.

వినతులను నిర్లక్ష్యం చేయొద్దు

కలెక్టర్ టిఎస్.చేతన్


వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే ప్రజా వినతుల పరిష్కారంపై ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా క్షేత్రస్థాయిలో క్షుణ్నంగా పరిశీలించి వాటికి పరిష్కారం చూపాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు, తహశీల్దార్లతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయ సారథి, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షించనున్నట్లు చెప్పారు. రెవెన్యూకు సంబంధించి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అర్జీల పరిష్కారంపై ఆర్డీవోలు, తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ రత్న

ముగిసిన పోలీస్ క్రీడలు

పోటీలతో ఉత్సాహం : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తిలోని పరేడ్ మైదానంలో మూడు రోజుల నుంచి జరిగిన పోలీస్ వార్షిక క్రీడా పోటీలు శుక్రవారం ముగిసాయి. ఎస్పీ పోలీస్ సిబ్బందితో కలిసి టగ్గాఫర్ ఆడారు. ఇందులో జిల్లా ఎస్పీ జట్టు, ఏఎస్పీ ఇరు జట్లు హోరాహోరీగా తలపడగా ఎస్పీ జట్టు విజయం సాధించింది. అనంతరం క్రీడల్లో విజేతలకు ఎస్పీ వి.రత్న బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసుల నిత్య జీవితంలో క్రీడలు కూడా ఎంతో ముఖ్యం అన్నారు. క్రీడలు, ఆటలు శారీరక, మానసికోల్లాసం కల్గిస్తాయన్నారు. క్రీడా స్ఫూర్తితో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని తెలియజేశారు. చిన్నా పెద్ద అనే బేధాలు లేకుండా సిబ్బంది మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందన్నారు. ఈ ఉత్సాహంతో 2025లో మరింత ముందుకు వెళ్లాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏవో సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీలు విజయ్ కుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, కెవి.మహేష్‌తో పాటు జిల్లాలోని సిఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే వైద్య సౌకర్యాలు అందించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఆర్టీసీలోని ఉద్యోగులకు పాత పద్ధతిలోనే వైద్య సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ఎంప్లాయిస్ అధ్యక్షులు వలిసెట్టి దామోదర్ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని షాదీ మహల్ లో ఆసంఘం జిల్లా అధ్యక్షుడు నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల భద్రతపై ఇయు పోరాడుతోందన్నారు. అయితే ఇంకా కొన్ని డిపోలలో అధికారులు ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి సంఘటనలు జరిగితే రాష్ట్ర నాయకత్వం దృష్టికి తేవాలన్నారు. ఎవరు తప్పు చేయకున్నా ఉద్యోగులపై సంస్థ పరంగా తప్పుడు కేసులు పెడితే సహించేది లేదన్నారు. ఆర్టీసీలో సుమారు పదివేల పోస్టులు ఖాళీలు ఉన్నాయని వాటిని భర్తీ చేయాలని యాజమాన్యం పై ఒత్తిడి తెస్తామన్నారు. ఆర్టీసీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఇయు నిరంతరం కృషి చేస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇయు రాష్ట్ర కమిటీ సభ్యుడు, జోనల్ నాయకులు ఎన్‌సి శేఖర్, అరుణమ్మ, నబి రసూల్, రీజనల్ నాయకులు కెబిఎన్ రెడ్డి, జివైపి రెడ్డి, ఎన్ నారాయణస్వామి, ఆర్‌విఎస్ రెడ్డి, విజయలక్ష్మి, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

మండలంలోని స్టోర్ డీలర్లు స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి కంప్యూటర్‌ను అందజేశారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్‌కార్యాలయంలో డిటికి కంప్యూటర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టోర్ డీలర్ల సంఘం మండల అధ్యక్షులు రాజారెడ్డి, మండోజి ఆరిఫ్ ఖాన్, అంజినప్ప, సాదీ నాగరాజు, బావసుపల్లి బాబు, సతీష్ ,సుధాకర్ రెడ్డి, మునీంద్ర, డ్రిప్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

రొళ్ల మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను విధుల నుండి తొలగించడం సమంజసం కాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం కొత్తచెరువులోని జిల్లా కార్మిక శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. 10 సంవత్సరాలనుండి పని చేస్తున్నవారిని ఉన్న ఫలంగా తొలగించి వారి కుటుంబాలను రోడ్డు పాలు చేశారని అన్నారు. రాజకీయ కక్ష , వివక్షతో పారిశుధ్య కార్మికుల పొట్ట కొట్టడం సరైన పద్ధతి కాదన్నారు. అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

సత్ప్రవర్తనతో మెలగాలి : న్యాయమూర్తి రాజ్యలక్ష్మి


ఖైదీలతో వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి-హిందూపురం

ఖైదీలు జైలు నుండి బయటకు వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక ఉప కారాగారాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో ఆహారం, పరిసరాల శుభ్రత తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జైలుకు రావడం వల్ల వ్యక్తిగత ప్రతిష్ట కూడా దెబ్బతింటుందని, కనీసం జైలు నుండి బయటకు వెళ్లిన తర్వాత అయినా మంచి ప్రవర్తనతో ప్రశాంత జీవనం సాగించాలని కోరారు. అనంతరం సబ్ జైలుకు సరఫరా అవుతున్న ఆహార ధాన్యాల నాణ్యతను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగార అధికారి హనుమన్న, న్యాయవాదులు సంతోషి కుమారి, కళావతి, ఈశ్వరప్ప, లోక్ అదాలత్ సిబ్బంది శారద తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు


వార్డుల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి - మడకశిర

మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను వార్డులలో పర్యటించి సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని కోట వీధి 13 వ వార్డు, బెగార్లపల్లి 19వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డులో ప్రజలకు తాగునీటి సమస్య, పారిశుధ్యం, వీధిదీపాలు తదితర సమస్యలు ఉన్నాయన్నారు. మున్సిపల్ అధికారులు ప్రజలను మమేకం చేస్తూ ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు, బలరాం , ఉమాశంకర్, మేఘన రమేష్, మాజీ కౌన్సిలర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, మీడియా కోఆర్డినేటర్ రవికుమార్, డాక్టర్ సెల్ కృష్ణమూర్తి, తెలుగు యువత తిమ్మరాజు, డీలర్ రవికుమార్ చంద్రశేఖర్, సోము తదితరులు పాల్గొన్నారు.

వక్క తోటల పరిశీలన : నియోజకవర్గంలో రైతులు ప్రధానంగా సాగు చేస్తున్న వక్క తోటలను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పరిశీలించారు. వక్క పంటకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని ఇప్పటికే అసెంబ్లీలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి రోళ్ల మండలంలోని వక్కతోటలను పరిశీలించారు. పంటసాగు, దిగుబడి, మార్కెట్ సౌకర్యం తదితర వాటిపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కుంచిటి వక్కలిక రాష్ట్ర కన్వీనర్ విఎం. పాండురంగప్ప, కన్వీనర్ దాసిరెడ్డి, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి మారుతి ప్రసాద్, రవికుమార్, భరత్ కుమార్, మహేష్ రైతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లావాదేవీలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - బుక్కపట్నం

ఆన్‌లైన్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వినియోగదారుల సంఘ సమాఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బూల్ హుస్సేన్ తెలిపారు. జాతీయ వినియోగదారుల రక్షణ దినోత్సవం పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆన్‌లైన్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఖరీదైన వస్తువులతో పాటు నిత్య నిత్యవసర వస్తువులు మరియు ఎలక్ట్రానిక్ వస్తువులను సైతం ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహనతో పాటు బాధ్యత కూడా కలిగి ఉండాలని చెప్పారు. వినియోగదారులు మోసపోతే వినియోగదారుల ఫోరంను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి షబనాం, వినియోగదారుల సంఘం సెక్రటరీ రామలక్ష్మి,, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

23న మున్సిపల్ బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో ఈనెల 23న కౌన్సిల్ హాల్‌లో పురపాలక సంఘ బడ్జెట్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ కె. లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో బడ్జెట్ గూర్చి చర్చించబడునని తెలిపారు. తదుపరి పట్టణ సమస్యల గురించి చర్చిస్తామన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని వారు కోరారు.

హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

హెల్త్ అసిస్టెంట్ల ఉద్యోగాలను తొలగించకుండా వారిని కొనసాగిస్తూ, గతంలో తొలగించిన వారికి ఉద్యోగాలు కల్పించాలని హెల్త్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో హెల్త్ అసిస్టెంట్లు వైద్య సిబ్బందితో కలసి వైద్యాధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్, కోవిడ్ లాంటి జాతీయ విపత్కర పరిస్థితుల్లో, అంటువ్యాధుల ప్రాబల్యంలోనూ ప్రాణాలు పణంగా పెట్టి హెల్త్ అసిస్టెంట్లు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులోను వీరి సేవలు చిరస్మరణీయమని చెప్పారు. 20 సంవత్సరాలుగా ఇదే ఉద్యోగాన్ని నమ్ముకొని జీవిస్తున్న తమకు ఉద్యోగ రక్షణ కల్పించాలని, ఉద్యోగాలు కోల్పోయిన వారిని వెంటనే విధులు లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు తిమ్మప్ప, శ్రీనివాసులు, పవన్ కుమార్, మధు, అనిల్, రత్నమ్మ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని వివిధ గ్రామాలలో వ్యవసాయ శాఖ అధికారులు పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. మండలంలోని రొద్దకంపల్లి గ్రామంలో నాగరాజు, క్రిష్టప్పకు చెందిన పొలాల్లో, పెద్దగువ్వలపల్లి గ్రామంలో శశి, అన్వర్ భాష లకు చెందిన పంట పొలాల్లో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ నివేదిత, ఎఎస్ఒ వెంకటరమణ, ఇన్సూరెన్స్ అధికారి యల్లప్ప, కవిత, నాయకులు నాగరాజు, సత్యశేఖర్, డీలర్ హనుమంతు, ఎల్. వెంకటరాముడు, ఎంపీటీసీ భర్త అంజినరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సీజనల్ వ్యాధులు, వ్యాధి నిరోధక టీకాలపై పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జగరాజు పల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గర్భిణులు, చిన్న పిల్లలకు ఇచ్చు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, హెల్త్ ఎడ్యుకేటర్ చంద్ర నాయక్, ఆరోగ్య కార్యకర్త ప్రమీల, ఆశా కార్యకర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - మడకశిర

నగర పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని13వ వార్డు కౌన్సిలర్ మేఘన రమేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం 13వ వార్డు 194వ బూత్‌లో పర్యటించిన 13వ వార్డు కౌన్సిలర్ మేఘన రమేష్ , బొమ్మయ్య గారి చంద్ర, యూనిట్ ఇంచార్జ్ రవిబాబు, మాజీ కౌన్సిలర్ నాగిరెడ్డి, టిడిపి కార్యకర్తలు సుధ అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామనికౌన్సిలర్ మేఘన రమేష్ తెలిపారు.

చెత్తతో సంపద తయారీపై శిక్షణ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్ర సమీపంలో ఉన్న చెత్త తయారు చేసే కేంద్రం వద్ద పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ కార్మికులకు చెత్తతో సంపద తయారీపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఇఒఆర్‌డి సునీత మాట్లాడుతూ తడి పొడి చెత్తను వేరు చేసి ఎరువు తయారు చేసి వాటి అమ్మకాలు ద్వారా వచ్చిన నగదు పంచాయతీ ఖాతాలో జమ చేసి రికార్డులు తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, రెడ్డమ్మ, భవాని, వసుంధర, మండల కోఆర్డినేటర్ సిహెచ్ ఇలియాజ్, పంచాయతీ కార్మికులు అక్కులప్ప, నర్సింహులు, అంజి, కదిరప్ప పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ అనుపమ పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ వినియోగదారుల రక్షణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మునిసిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో తహశీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని సరైన సేవలు అందుకోవాలన్నారు. అనంతరం వినియోగదారుల రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ కల్తీ ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల అనారోగ్యానికి గురవుతారన్నారు. దుకాణాలలో వస్తువులు తీసుకునే సమయంలో ఎంతవరకు సమయం ఉందన్న విషయాన్ని గమనించాలన్నారు. తీసుకొన్న ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవాలన్నారు. అవి కల్తి సరుకు అయితే వినియోగదారుల ఫోరంలో ఆశ్రయించవచ్చని లేదా వినియోగదారుల సంఘాల ప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఖాదర్‌వలి, గోరంట్ల వినియోగదారుల అధ్యక్షులు చలపతి, లక్ష్మీ రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ పరిధిలోని డి1 ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. శనివారం పట్టణ పరిధిలోని డిఆర్ కాలనీ, డీబీ కాలనీ, లక్ష్మీపురం, శ్రీకంఠపురం, మోడల్ కాలనీ, నానెప్ప నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. 11 కె.వి. లైన్ లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారులతో సహకరించాలని కోరారు.

కంకర టిప్పర్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

ప్రజాశక్తి-పెనుకొండ

పరిమితికి మించి అధిక లోడుతో రవాణా చేస్తున్న మూడు టిప్పర్లను పోలీసులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. పెనుకొండ మండలం అమ్మవారి పల్లిలో వీటిని స్వాధీనం చేసుకున్నారు. కియా ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాలను మేరకు మండల పరిధిలోని అమ్మవారి పల్లి వద్ద గ్రీన్ టెక్ సంస్థకు పెడపల్లి వద్ద నుంచి మూడు టిప్పర్లలో కంకర తరలిస్తున్నారు. పరిమితికి మించి అధిక టన్నుల బరువుతో టిప్పర్లు కంకర తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వాహనాలను సీజ్ చేసి రవాణా శాఖ అధికారులకు సిఫార్సు చేశారు.

పోలీసు, రవాణా శాఖ అధికారులపై మండిపడ్డ ప్రజా ప్రతినిధి

టిప్పర్లను సీజ్ చేసిన విషయం తెలుసుకున్న ఓ ప్రజా ప్రతినిధి పోలీసులు,రవాణా శాఖ అధికారులపై మండిపడినట్టు తెలిసింది. 11 గంటల వరకు సమయం ఇస్తున్నానని అంత లోపల టిప్పర్లను వదిలివేయాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తానని హెచ్చరించినట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. ప్రజా ప్రతినిధి అధికారులపై మండి పడటంతో రవాణా అధికారులు టిప్పర్లను వేబ్రిడ్జి పై బరువును వేయించకుండానే వెళ్లిపోయినట్లు తెలిసింది. నియోజకవర్గంలో అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల మధ్య ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం ఆ పార్టీ నాయకుల కార్యకర్తల్లో చర్చనీయాంశమైంది.

పోలీసు, రవాణా శాఖ అధికారులపై ఓ ప్రజాప్రతినిధి ఆగ్రహం

నాణ్యమైన వస్తువులనే కొనుగోలు చేయాలి : ఆర్డీవో



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, తదితరులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

నాణ్యమైన వస్తువులను మాత్రమే వినియోగదారులు కొనుగోలు చేయాలని ఆర్డీవో మహేష్ తెలిపారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, వినియోగదారుల సంఘం, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్, ప్రిన్సిపాల్, విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం 2019 ను స్ఫూర్తిగా, లక్ష్యంగా తీసుకొని ప్రజలందరికీ అవగాహన కల్పించాలని తెలిపారు. మోసపూరిత ప్రకటనలు ప్రభావితం కారాదని, కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు రసీదు పొందాలని, ఎమ్మార్పీ ధర కన్నా అధిక బిల్లు చెల్లించరాదని సూచించారు. వినియోగదారుల చట్టంపై సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు అవగాహన చేసుకున్నప్పుడే, ఎటువంటి అన్యాయం జరగదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి లక్ష్మీదేవి, ధర్మవరం తహశీల్దార్ సురేష్ బాబు, వినియోగదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలా ప్రభాకర్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి, అధ్యాపకులు శ్రీనివాస్ రెడ్డి, మల్లికార్జున, కరుణాసాగర్, రాజేశ్వర రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కుళ్లాయిరెడ్డి,ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ శైలజ, ఉపాధ్యాయులు వేణుగోపాలాచార్యులు, నౌరా, పట్టణ వినియోగదారుల సంఘం అధ్యక్షులు కుల్లాయప్ప, కోశాధికారి రవీంద్ర, గౌరవ అధ్యక్షులు గోవిందు, సభ్యులు సుభాన్, నారాయణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్గో డోర్ డెలివరీని విస్తృతం చేద్దాం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ఆర్టీసీ ప్రవేశపెట్టిన కార్గో వ్యవస్థ ఇప్పటికే మంచి గుర్తింపు తెచ్చుకున్నదని, ఇందులో భాగంగానే కార్గో డోర్ డెలివరీ ని మరింత అభివృద్ధి పరచాలని డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా డిపో ఆవరణంలో డెలివరీ ప్రచార మాసోత్సవాన్ని వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కార్గో వ్యవస్థ వ్యాపారస్తుల వద్ద, ప్రజల వద్ద మంచి గుర్తింపు పొందిందని చెప్పారు.కార్గో ద్వారా ఒక కేజీ బరువు నుంచి 50 కేజీల వరకు (జిఎస్టి అదనం) డోర్ డెలివరీని నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులందరూ కూడా ఒక్కొక్కరు మూడు డెలివరీని కార్గో ద్వారా చేయించి కార్గో అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. ఆర్టీసీకి కార్గో వ్యవస్థ ఎంతో సహకరిస్తుందని తెలిపారు. ఈ డోర్ డెలివరీ వ్యవస్థను మనతోపాటు మన కుటుంబీకులు, స్నేహితులు, బంధువులు, భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాలు ఈనెల 20వ తేదీ నుండి జనవరి 19వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ధర్మవరం డిపోకు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది శ్రీరాములు, రామ్మోహన్ రెడ్డి, డిపో మెకానిక్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి పూర్వ వైభవం తీసుకొస్తాం

వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-సోమందేపల్లి

పెనుకొండ కోటపై వైసీపీ జెండా ఎగరవేస్తామని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని వైయస్సార్ సర్కిల్లో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలను పెనుకొండ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తల మధ్యన ఘనంగా నిర్వహించారు. ముందుగా వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. అనంతరం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి సుమారు 30 కేజీల కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఉషశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను మరచి వైసిపి నాయకుల పైన అక్రమ కేసులు బనాయిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గజేంద్ర, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు రమాకాంత్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు గోవిందమ్మ గారి శ్రీనివాసులు, జడ్పిటిసి డిసి అశోక్, మేజర్ పంచాయతీ సర్పంచి భర్త నరసింహులు, నియోజకవర్గ నాయకులు సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పొగాకు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఎస్ఎస్‌సి మోడల్ పేపర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - రొద్దం

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థుల కోసం రూపొందించే ఎస్ఎస్‌సి మోడల్ పేపర్లను శుక్రవారం మండలంలోని చోలే మరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విడుదల చేశారు. పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 34 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాజీ సర్పంచి అప్పిరెడ్డి, బ్యాంక్ అధికారి అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు యుటిఎఫ్ మోడల్ పేపర్లను సద్వినియోగం చేసుకొని, పరీక్షల్లో మంచి మార్కులు ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్, సీనియర్ నాయకులు నారాయణస్వామి, యుటిఎఫ్ మండల అధ్యక్షులు సానిపల్లి గంగాధర్, గౌరవ అధ్యక్షులు టి రమేష్, నాయకులు సత్యమయ్య, వెంకటేష్, రామాంజనేయులు, ఉపాధ్యాయులు సాయినాథ్ రెడ్డి, అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు.



మోడల్‌పేపర్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

404, 405 జీవోలను రద్దు చేయాలి

ఉమ్మడి అనంత జలసాధన సమితి నాయకులు



హెచ్‌ఎన్ఎస్ చీఫ్ ఇంజనీరింగ్ ఆఫీసు వద్ద ధర్నాలో నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

మాల్యాల నుంచి జీడిపల్లి వరకు 3850 క్యూసెక్కుల కాలువ వెడల్పు చేసేందుకు జీడిపల్లి నుంచి కాలువ లైనింగ్ చేయటానికి ఎన్‌డిఎ చంద్రబాబు ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోలు 404, 405లను రద్దు చేయాలని జలసాధన సమితి ఉమ్మడి అనంతపురం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హంద్రీనీవా చీఫ్ ఇంజనీర్ ఆఫీస్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమానికి జలసాధన సమితి అధ్యక్షులు రామకుమార్ అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తలుగా మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్, సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సాగునీటి రంగ నిపుణులు ఎస్.ఎం.బాషా, రచయిత శాంతి నారాయణ హాజరై మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలు హంద్రీనీవా ప్రాజెక్టు ప్రయోజనాలకు విఘాతం కలిగించే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రజలకు తీవ్ర నష్టం కలగజేసే ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం రాయలసీమ నాలుగు జిల్లాలలో ఆరు లక్షల ఎకరాలకు ప్రధానంగా అనంతపురం జిల్లాలో 3,45,000 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే విధంగా రూపకల్పన చేశారని తెలిపారు. దీనికి విరుద్ధంగా చంద్రబాబు ప్రభుత్వం జీవోలు విడుదల చేయడం దుర్మార్గం అన్నారు. హంద్రీనీవా ప్రధాన ఉద్దేశం నెరవేరాలంటే మాల్యాల నుంచి జీడిపల్లి వరకు పదివేల క్యూసెక్కులతో జీడిపల్లి నుంచి గొల్లపల్లి వరకు 6000 అక్కడ నుంచి మారాల వరకు 5000 క్యూసెక్కులు, మారాల నుంచి చెర్లోపల్లి వరకు 4500 క్యూసెక్కులు కాలువ వెడల్పు చేయాలన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు 1500 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలన్నారు. కృష్ణా నది నుంచి తెచ్చుకున్న నీటిని నిల్వ చేసుకోవడానికి అవసరమయ్యే ప్రాజెక్టులు నిర్మించాలని డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌ను నిర్మించి ఉమ్మడి అనంతరం జిల్లాలో నిర్దేశించిన విధంగా 3.45లక్షల ఎకరాలకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం హంద్రీనీవా చీఫ్ ఇంజనీర్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసులు, జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతు సంఘ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సిపిఐ నాయకులు మల్లికార్జున, అఖిల భారత రైతు సంఘాల నాయకులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రైతు సంఘం నాయకులు కృష్ణ, ఐఎఫ్‌టియు నాయకులు సురేష్, యేసు, జల సాధన సమితి నాయకులు పెద్దన్న, వీరనారప్ప, చంద్ర, విద్యావంతుల వేదిక నాయకులు వెంకటేష్ నాయకులు నల్లప్ప పాల్గొన్నారు.

అమిత్‌షాను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయాలి



హిందూపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

పజాశక్తి-సోమందేపల్లి

భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఆయనను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షాను పార్లమెంట్ నుండి సస్పెండ్ చేస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల కన్వీనర్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అమానుషమన్నారు. ప్రస్తుతం ఆయన అనుభవిస్తున్న పదవి అంబేద్కర్ పెట్టిన భిక్ష అని అలాంటి వ్యక్తిని పార్లమెంట్ సాక్షిగా అవమానించడం అంటే క్షమించరాని నేరమన్నారు. అమిత్ షా తన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకొని ప్రజలకు క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో కాంగ్రెస్ తరపున దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పుట్టపర్తి క్రైమ్ :రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రహోంమంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని పుట్టపర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ను దెబ్బతీయాలనుకుంటే రాజకీయంగా ఎదుర్కోవాలని అన్నారు. అంబేద్కర్‌ను నిండు సభలో అవమానించడం ప్రజల మనోభావాలను దెబ్బతీశాయన్నారు. అంబేద్కర్‌ను కాంగ్రెస్ ఎప్పుడు గౌరవిస్తుందని చెప్పారు. రాజ్యాంగాన్ని కనుమరుగు చేయడమే బిజెపి లక్ష్యన్నారు. ఉద్దేశపూర్వకంగా అంబేద్కర్‌ను అవమానించారన్నారు.

హిందూపురం :భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను ఉద్దేశించి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని వివిధ ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ శ్రీరాములు, జామియా మసీదు ముతవల్లి నూరుల్లా ఖాన్, ఇషాక్, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, మాజీ కౌన్సలర్ రామ్మూర్తి, ముస్లిం నగారా ఉమర్ ఫరూక్, క్రైస్తవ యువజన సంఘం నాయకులు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా ను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలి : భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను బర్తరఫ్ చేసి, దేశద్రోహం కింద కేసు నమోదు చేయాలని బిఎస్‌పి రాష్ట్ర నాయకులు శ్రీరాములు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం బిఎస్‌పి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారథీ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు దాసరి ఈశ్వరయ్య, శ్రీనివాసులు, మౌలాలి, చిరంజీవి, నరసింహప్ప, బాబు, క్రిష్టప్ప, ఫక్రుద్దీన్ సాబ్, రామాంజి, తిరుమలేష్, హుస్సేన్, అనిల్, ఆదినారాయణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

కదిరి టౌన్ : కేంద్రహోం మంత్రి అమిత్ షాను అమిత్ షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కదిరి కాంగ్రెస్ నాయకులు చిలమత్తూరు మోహన్ గాంధీ, కదిరప్ప ఆధ్వర్యంలో కదిరి అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు.అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలతో శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలోకదిరి మహిళా అధ్యక్షురాలు నీలోఫర్, మైనార్టీ ప్రెసిడెంట్ షౌకత్‌అలీఖాన్, మైనార్టీ నాయకులు వెల్డర్ బాబాచ కళాకారుల సంఘం భాస్కర్, వెంకటనారాయణ, రమణ, నరసింహులు జగదీశ్వర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

డివైడర్‌ను ఢీ కొన్న బొలెరో

ఆరుగురికి గాయాలు
ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - బత్తలపల్లి

అనంతపురం కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని రామాపురం కూడలిలో శుక్రవారం బొలెరో వాహనం టైరు పేలి వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆరుగురు గాయపడగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ధర్మవరం పట్టణానికి చెందిన చితంబరం ముదిగుబ్బ నుంచి కట్టెలు(మొద్దులు) బొలెరో వాహనంలో తీసుకుని వెళుతున్నారు. వాహనం మండల పరిధిలోని రామాపురం కూడలికి చేరుకోగానే టైరు పగిలింది. దీంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొంది. ఈ సమయంలో కట్టెలపైన కూర్చున్న కదిరప్ప (ఓబుళాపురం, బత్తలపల్లి మండలం), గంగప్ప(ధర్మవరం), ముత్యాలప్ప(నాగలూరు, ధర్మవరం మండలం)తో పాటు డ్రైవర్ రంగా, హరి, చిత్రంబరం గాయపడ్డారు వీరిని స్థానికులు వెంటనే 108 వాహనంలో బత్తలపల్లి ఆర్టీటీ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాన్ని రోడ్డుపై పడిన మొద్దులను తొలగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రోడ్డు ప్రమాద దృశ్యం

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ ప్రోహిబిషన్‌ఎక్సైజ్ సిఐ సృజనబాబు ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది సోమందేపల్లి మండలం మండ్లి లో శుక్రవారం దాడులు చేశారు. ఎస్ మారుతి అనే వ్యక్తి తన మోటార్ సైకిల్ పై కర్నాటక మద్యం రవాణా చేస్తు పట్టుపడ్డాడు. అతని వద్ద నుంచి 96 ఐవాట్స్, చెర్రీస్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ దాడులలో ఎస్ఐలు రాజశేఖర్, రాముడు, కానిస్టేబుల్ ఈశ్వర్, హరి, బాలకృష్ణ, జ్యోతి, శాంతి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - బత్తలపల్లి

పేద ప్రజలకు ప్రభుత్వం పంపిణీ చేసిన రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తుండగా రెవెన్యూ అధికారులతో కలిసి విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఉదయం బత్తలపల్లి మండలం లింగారెడ్డిపల్లి బస్‌స్టేజి సమీపంలో శ్రీజ పాల డైరీ వద్ద అనంతపురం విజిలెన్స్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, డిసిటివో సురేష్, సిఎస్‌డిటి దేవరకొండ రామకృష్ణ దాడులు నిర్వహించారు. అక్రమంగా తరలిస్తున్న 62 క్వింటాళ్ల (124 బస్తాలు) రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని నార్పలకు చెందిన ఎరికల మహేష్, సోమందేపల్లి మండలానికి చెందిన నరేష్, డ్రైవర్ బోయ సతీష్, అశ్వర్థనారాయణ తదితరులు బొలెరో వాహనంలో బెంగళూరుకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. బత్తలపల్లి తహశీల్దార్ స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ధర్మవరం స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు చెప్పారు.

వైసిపి అనుబంధ కమిటీల్లో 'పురం'నాయకులు

హిందూపురం :హిందూపురం నియోజకవర్గం లోని పలువురు వైసిపి ముఖ్య నాయకులను అనుబంధ సంఘాలకు ప్రతినిధులుగా నియమిస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా నాగమణి, బూత్ కమిటీల జిల్లా అధ్యక్షులుగా వాల్మీకి లోకేష్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడిగా మహేష్ గౌడ్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మార్కెట్ చాంద్ భాషాలను నియమిస్తూ రాష్ట్ర అధిష్టానం నియామక ఉత్తర్వులు అందజేసింది. తమకు పార్టీ కీలక పదవులు దక్కడంలో సహకరించిన హిందూపురం నియోజకవర్గ పార్టీ బాధ్యురాలు దీపిక, వైసిపి నేత వేణురెడ్డిలను శుక్రవారం స్థానిక కార్యాలయంలో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ

మడకశిర రూరల్ : మండల పరిధిలోని శ్రీ వేంకటశ్వర వద్దాశ్రమంలో పావుగడ తాలూకా నాగలమడక గ్రామానికి చెందిన మారుతి దంపతులు వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. వారి కుమారుడు సుధీర్ పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు బట్టలు పంపిణీ చేశారు.

రైతు సేవా సిబ్బంది సామర్థ్యం పెంపుపై శిక్షణ

ప్రజాశక్తి - చిలమత్తూరు

హిందూపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల రైతు సేవా కేంద్ర సిబ్బందికి సామర్థ్యం పెంపుపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వివిధ పంటలలో సమగ్ర ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, వివిధ పంటలలో చీడపీడల నివారణ చర్యలు తదితర వాటిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి మహేష్ నాయక్, ఎపిఎంఐపి పీడీ సుదర్శన్, ఎడిఎ అల్తాఫ్ అలీఖాన్, డాట్ సెంటర్ వ్యవసాయ శాస్త్రవేత్త రామసుబ్బాయ్య, హెచ్ఒ మహేష్ నాయక్, సిరికల్చర్ అధికారి రమణ రెడ్డి, డివిజన్‌లోని మండల వ్యవసాయ అధికారులు వంశీక్రిష్ణ, ముని క్రిష్ణ, సురేంద్ర నాయక్, శ్రీలత, విజయభారతి, ఎఇఒలు, రైతు సేవ కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

భూ సమస్యలను పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పెనుకొండ ఆర్డీవో ఆనంద్ బాబు అన్నారు. ఈ మేరకు శుక్రవారం వీరాపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలపై ఆర్డీవోకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీటీ జగన్నాథ్, మండల సర్వేయర్ కోదండపాణి, సీనియర్ అసిస్టెంట్ నేలకోటప్ప, వీఆర్వో విజయ్‌సాయి, సర్పంచి లక్ష్మి పతిరెడ్డి, టిడిపి నాయకులు చెన్నమ్మ, లక్ష్మిదేవమ్మ, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండల పరిధిలోని ఎదురుదోన గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో వివిఎస్ శర్మ మాట్లాడుతూ రైతులు భూ వివాదాల సమస్యలపై ఈ సదస్సులో అర్జీ రూపంలో విన్నవిస్తే వాటిని విచారించి పరిష్కరిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో సర్పంచి నాగ మునీశ్వర నాయుడు, మండల సర్వేయర్ జిలానీ, ఆర్ఐ శ్రీధర్, ఫారెస్ట్ అధికారులు రామచంద్ర నాయక్, గ్రామ సర్వేయర్లు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ఏళ్ల తరబడి నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించడానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఆర్డీవో శర్మ అన్నారు. శుక్రవారం కదిరి మున్సిపాలిటీలోని ఎర్రగుంటపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ మురళీకృష్ణ, మండల స్థాయి అధికారులు, సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని రొళ్ల తహశీల్దార్ షేక్షావలి తెలిపారు. శుక్రవారం రొల్ల మండల పరిధిలోని మల్లినమడుగులో రెవిన్యూ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గిరియప్ప, వీఆర్వో చిరంజీవి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బిఎస్ గురుమూర్తి, అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించడానికి కృషి చేస్తామని ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్షులు పీవీ రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎన్ఎంయు నాయకులు పిలుపుమేరకు ఆయన పుట్టపర్తికి విచ్చేశారు. ఆయనకు ఆ యూనియన్ రీజినల్ కార్యదర్శి షబ్బీర్ తో పాటు ఉపాధ్యక్షులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యంతో చర్చించి నైట్ అవుట్ అలవెన్స్ ను తిరిగి పునరుద్ధించడానికి కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవితేజ, అప్పిరెడ్డి, శివశంకర్, ఈశ్వరయ్య, గంగులయ్య, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.